క్లుప్తంగా

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రసన్న



స్పీకర్ తమ్మినేనికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి, గొల్లపల్లి విజయ్‌కుమార్

కోవూరు : రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్, ఇరిగేషన్‌శాఖ మంత్రి అంబటి రాంబాబును కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనసభలోని వారి కార్యాలయాల్లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా గొల్లపల్లి విజయకుమార్‌ను ఎంపిక చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి రావు ఉన్నారు.

19న జిల్లాస్థాయి చెస్ పోటీలు

బుచ్చిరెడ్డిపాళెం : ఈనెల 19న జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.మస్తాన్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలో మాట్లాడుతూ కోవూరులోని శ్రీచైతన్య స్కూల్లో ఓపెన్, మహిళా జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. పూర్తి వివరాలకు 98481 47889 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బీమా నగదు అందజేత

ఇందుకూరుపేట : వైఎస్సార్ బీమా ద్వారా మండలంలోని గంగపట్నం గ్రామానికి చెందిన యాదల శేషరావు కుటుంబానికి బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. శేషరావు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మాధురీ, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి దండిగుంట ఫణీంద్రనాయుడు, మేనాటి ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

కోవూరు : మండల కేంద్రంలోని శాంతినగర్‌లో వేములచేడు పద్మావతమ్మ (82) బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆమె నేత్రాలను కుమారుడు వెంకట ప్రసాద్ అంగీకారంతో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాల నేత్రదాతల మోటివేటర్ బాలాజీసింగ్, లాలీష్ నేతృత్వంలో సేకరించారు. ఇందుకు కోవూరు సుభాష్ సేవా సంఘం కృషి చేసింది.

• విడవలూరు మండలం రామ్‌నగర్ కాలనీలో మైనపాటి జయరామయ్య (50) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన నేత్రాలను విడవలూరు మనసేవా సంస్థ ద్వారా జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు కుటుంబ సభ్యుల అంగీకారంతో దానం చేశారు. ఈ నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల టెక్నీషియన్లు సేకరించారు.

వెంకటాచలం రైల్వేగేటు మూత



వెంకటాచలం : వెంకటాచలం నుంచి సర్వేపల్లి వైపు వెళ్లే మార్గంలో రైల్వే గేటును రెండు రోజుల పాటు రైల్వే అధికారులు మూత వేయించారు. వెంకటాచలం గేటు వద్ద మూడో రైల్వేలైన్ పనుల నిమిత్తం బుధవారం, గురువారం రెండు రోజులు మూత వేస్తున్నట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. దీంతో సర్వేపల్లి వైపు వెళ్లే ప్రయాణికులు రాకపోకలను తిక్కవరప్పాడు గ్రామం మీదుగా కొనసాగిస్తున్నారు.

రంగనాథుడికి రూ.20.78 లక్షల రాబడి



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలో కొలువైన శ్రీదేవి,భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామికి హుండీ కానుకలు, బ్రహ్మోత్సవ టికెట్ల విక్రయం ద్వారా రూ.20,78,850 రాబడి వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీలతో పాటు గతేడాది డిసెంబర్ 15 నుంచి ఈ ఏడాది మార్చి 15వ తేదీ వరకు పర్మినెంట్ హుండీలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు చేపట్టారు. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.19,00,046 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. అమెరికన్, ఆస్ట్రేలియా,కెనడా, ఇండోనేషియా దేశాలకు చెందిన కరెన్సీ సైతం భక్తులు కానుకగా సమర్పించారని వివరించారు. గతేడాది పోలిస్తే ఈ ఏడాది హుండీ ఆదాయం రూ.7,13,296 పెరిగిందని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,56,450, కల్యాణం చదివింపుల ద్వారా రూ.12,354 ఆదాయం వచ్చిందని వివరించారు. హుండీ కానుకల లెక్కింపును దేవాదాయ శాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్కే చైతన్య పర్యవేక్షించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్‌ఆచారి, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరెళ్లాలంటే.. నిరీక్షణే

• ఆటోల ప్రయాణమే దిక్కు
• వీటి వల్ల గ్రామాలకెళ్లని బస్సులు

పొదలకూరు : ఆటో డ్రైవర్లు కనికరిస్తేనే ఊర్లోందుకు వీలు కలుగుతోంది. లేదంటే గంటల తరబడి నిరీక్షణ చేయాల్సిందే. ప్రతినిత్యం గ్రామాల నుంచి మండల కేంద్రానికి పనులపై రావాలంటే ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆటోలు అందుబాటులో లేక ప్రయాణాలనే మానుకుంటున్నారు. ఈ తంతు గ్రామాల్లో నిత్యకృత్యంగా మారింది. ఆర్టీసీ బస్సు పాఠశాలలు, పనిదినాల్లోనే గ్రామాలకు వెళ్తుంది. మిగిలిన రోజుల్లో ప్రయాణికులు ప్రమాదకరమైన ఆటోలనే ఆశ్రయించాలి. మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నావూరు మార్గంలో వరుసగా అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం, నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం ఏడు గ్రామాలు ఉన్నాయి. ఈ మార్గంలో ఎప్పుడూ ఆటోలు కిటకిటలాడుతూనే ఉంటాయి. అన్ని వేళల్లో రవాణా సౌకర్యం అందుబాటులో లేక ఏడు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదలకూరు నుంచి భోగసముద్రం వరకు 20 కి.మీ దూరం ఉంది.



గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసు



పొదలకూరు బస్టాండ్‌లో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

బస్సులెక్కని గ్రామస్తులు

గతంలో ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడిచేవి. పెరిగిన జనాభా అవసరాల మేరకు బస్సులు నడిపే వేళలు అనుకూలంగా లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా బస్సులకు ఆదరణ తగ్గిపోయింది. ఆయిల్ ఖర్చులకు కూడా రాకపోవడంతో అధికారులు పల్లెలకు బస్సులను రద్దు చేసుకున్నారు. అయితే ఇప్పటికీ తోడేరు, భోగసముద్రం, పులికల్లు, నల్లపాళెం మార్గాల్లో ఆర్టీసీ బస్సులను తిప్పుతున్నారు. అయితే ఆటోలకు అలవాటు పడిన గ్రామస్తులు బస్సులను ఎక్కడం లేదు. ఫలితంగా విద్యార్థులు మాత్రమే బస్సులను ఎక్కుతున్నారు.

ప్రమాదమని తెలిసినా

ఆటోల్లో ప్రయాణం ప్రమాదమని తెలిసినా గ్రామస్తులు వాటినే ఆశ్రయించాల్సి వస్తోంది. గ్రామాల యువకులు ఆటోలను నడుపుతుండడం వల్ల నిత్యం వారితో ఉన్న అవసరాలను బట్టి వాటిల్లోనే ప్రయాణించాల్సి వస్తోంది. మండల కేంద్రం నుంచి ఆటోల్లో పరిమితికి మించి తరలిస్తున్నందున తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిబంధనల ప్రకారం తరలిస్తే తమకు గిట్టుబాటు కాదని ఆటో డ్రైవర్లు వెల్లడిస్తున్నారు. దీనికితోడు సకాలంలో ఆటోలు కూడా అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు వెల్లడిస్తున్నారు.

సకాలంలో చేరుకోలేకున్నాం



మా గ్రామం నుంచి ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉంది. ఎక్కడికి వెళ్లాలన్నా సకాలంలో చేరుకోలేకపోతున్నాం. బస్సులను అధిక సంఖ్యలో నడిపితే కొంతవరకు ఇబ్బందులు తలెత్తవు. మహిళల ప్రయాణం చాలా సమస్యగా మారింది. ఆట్లో ప్రయాణించాలంటే ప్రమాదాలు సంభవిస్తాయని బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది.

– వి.మాలకొండారెడ్డి, చెన్నారెడ్డిపల్లి

ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే



రామన్నపాళెంలో రీసర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ సీసీఎల్ఏ ఇంతియాజ్

• అడిషనల్ సీసీఎల్ఏ ఇంతియాజ్

కొడవలూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే చేపడుతోందని సెర్ప్ సీఈఓ, అడిషనల్ సీసీఎల్ఏ(చీఫ్ కమిషనర్ ల్యాండ్ అక్విజిషన్) ఎండీ ఇంతియాజ్ తెలిపారు. మండలంలోని రామన్నపాళెంలో జరుగుతున్న రీసర్వేను ఆయన బుధవారం పరిశీలించారు. రీసర్వే ఏ విధంగా చేస్తున్నారు? హద్దులు ఎలా కేటాయిస్తున్నారు.. తదితర వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రీసర్వేతో సమగ్ర భూహక్కు లభించి భూవివాదాలకు తెరపడుతుందని చెప్పారు. ఆయన వెంట సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ప్రసాద్, డివిజనల్ సర్వేయర్ ఎం.రాములు, తహసీల్దార్ ఈ.రమాదేవి, ఆర్ఐ గున్నం మల్లికార్జున, మండల సర్వేయర్ మాబాషా తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కోవూరు : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని, ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు, మహిళా పోలీసులు, ఆరోగ్య కార్యకర్తలతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సర్వే కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్ల విషయంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా పంచాయతీ కార్యదర్శులు పాలకవర్గంతో సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లను చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు పని వద్దనే తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా ఫీల్డ్ అసిస్టెంట్లు దృష్టి పెట్టాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ

పొదలకూరు : పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలో బుధవారం క్షయవ్యాధిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి రవికుమార్ మాట్లాడుతూ క్షయ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందన్నారు. దీర్ఘకాలికంగా దగ్గు కలిగి బరువు తగ్గుతుంటే వెంటనే క్షయ పరీక్షలు చేయించుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు జి.భాస్కర్, వైద్యారోగ్య సిబ్బంది అనూరాధ, రాధారాణి, శివప్రసాద్, సుమాజంజలి, సీత తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చేనేత నేతకు సన్మానం



పొదలకూరు : పట్టణానికి చెందిన చేనేత ఐక్యవేదిక జాతీయ కార్యవర్గ సభ్యుడు సీహెచ్ సుబ్రమణ్యంను బుధవారం ఐక్యవేదిక నేతలు పొదలకూరులో ఘనంగా సన్మానించారు. 20 ఏళ్లుగా చేనేత కార్మికుల హక్కుల కోసం విశేష సేవలు అందిస్తున్న సుబ్రమణ్యంను సన్మానించడం ఆనందంగా ఉందని నాయకులు వెల్లడించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూకోటి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ పముజుల శంకరయ్య, మండలాధ్యక్షుడు భాస్కరరావు, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, మురళీ పాల్గొన్నారు.

సచివాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గిరిజనులకు దుప్పట్లు అందజేస్తున్న రమేష్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇనకాక రమేష్‌రెడ్డి సూచించారు. వరకవిపూడిలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించిన అనంతరం గిరిజనులకు దుప్పట్లు, కొత్త ఆధార్ కార్డులను బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు సచివాలయంలో అందుబాటులో ఉంటుందన్నారు. స్థానిక నేత కూరపాటి కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్షలు



కొడవలూరు : చంద్రశేఖరపురంలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు కట్టుదిట్టమైన వాతావరణంలో బుధవారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. తొలిరోజు కావడంతో తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాల వద్దకు వచ్చి విద్యార్థులకు ధైర్యం చెప్పారు. కేంద్రాల వద్ద విద్యార్థుల కోసం ప్రాథమిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

వెంకటాచలం : వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్ష కేంద్రంలో వెంకటాచలం, రవీంద్రభారతి కళాశాల, మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మొత్తం 326 మంది విద్యార్థులకు 325 మంది హాజరయ్యారు. తొలి రోజు కావడంతో పరీక్షా కేంద్రం వద్ద ఉదయం నుంచే విద్యార్థినీ, విద్యార్థులు సందడి నెలకొంది. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్స విద్యార్థులకు పరిక్షలు జరగనున్నాయి.

• **పొదలకూరు :** పట్టణంలో ప్రశాంత వాతావరణంలో ఇంటర్ మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డీఎన్నార్ జెడ్పీబాలికల ఉన్నత పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, వైద్య సదుపాయాలను కల్పించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

• **తోటపల్లిగూడూరు :** తోటపల్లిగూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్ష కేంద్రంలో తోటపల్లిగూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు కోడూరు గురుకుల బాలికల కళాశాల, ఇందుకూరుపేటలోని వశిష్ఠ జూనియర్ కళాశాలకు సంబంధించిన విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి తొలిరోజు బుధవారం జరిగిన తెలుగు పరీక్షకు 199 మంది విద్యార్థులకు 190 మంది హాజరయ్యారు. తొమ్మిది మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ధనంజయ తెలిపారు.

• **కోవూరు :** ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు జరిగాయి. స్థానిక టీఎన్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 176 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 163 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇనమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 86 మంది విద్యార్థులకు 80 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 233 మంది విద్యార్థులకు 220 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు.

• **బుచ్చిరెడ్డిపాళెం :** బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రం వద్ద రెండు సెంటర్లకు సంబంధించి 525 మంది విద్యార్థులకు, 35 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్ష అధికారి కృష్ణ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహించడంతో పాటు అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

కొడవలూరు : మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య ఆదర్శ గిరిజన గురుకుల కళాశాలలో జరుగుతున్న ఇంటర్ మొదటి సంవత్సరపు పరీక్షలను జిల్లా కలెక్టర్ కేవీఎన్.చక్రధర్‌బాబు బుధవారం పరిశీలించారు. పరీక్ష జరుగుతున్న అన్ని గదులను పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. వసతులు, సీసీ కెమెరాల పనితీరును ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియను అడిగి తెలుసుకున్నారు. పరీక్షకు 118 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా, 115 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపల్ తెలిపారు. ప్రశ్నపత్రాల సెట్‌లను ఎవరి ఆదేశాల మేరకు ఓపెన్ చేస్తున్నారు.. తదితర వివరాలను తెలుసుకుని పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ రమాదేవి, ఎస్సై జి.సుబ్బారావు, అధ్యాపకులు ఉన్నారు.



తోటపల్లిగూడూరు ఇంటర్ పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హడావుడి



తోటపల్లిగూడూరు : వికలాంగ విద్యార్థిని పరీక్ష రాయించి తీసుకొస్తున్న సహచర విద్యార్థిని



కోవూరు: పరీక్షకు హాజరైన విద్యార్థులు



బుచ్చిరెడ్డిపాళెం : హాల్‌టికెట్ నంబర్లను సరిచూసుకుంటున్న విద్యార్థులు



బుచ్చిరెడ్డిపాళెం : పరీక్ష కేంద్రానికి చేరుకుంటున్న విద్యార్థులు



పొదలకూరు : విద్యార్థులకు అందుబాటులో ఉంచిన మందులు



పొదలకూరు : ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్షకు హాజరైన విద్యార్థినులు



వెంకటాచలం : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల హడావుడి

ముగిసిన భద్రతా వారోత్సవాలు



కార్మికుల చేత సురక్ష ప్రతిజ్ఞ చేయిస్తున్న కంపెనీ ప్రతినిధులు

తోటపల్లిగూడూరు : మండలంలోని అనంతపురం గ్రామంలో ఉన్న సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కంపెనీలో జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుక బుధవారం జరిగింది. కంపెనీ ఆపరేషన్ హెడ్ ప్రవీణ్‌సుంకర్, మెయింటెనెన్స్ హెడ్ గౌతమ్ నయన్, హెచ్‌ఆర్ హెడ్ శంకర్‌ప్రసాద్ హాజరై పని ప్రదేశంలో కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రత విషయంలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్మికుల చేత సురక్ష ప్రతిజ్ఞ చేయించారు.

పంట వివరాలను సరి చూసుకోవాలి

• ఏఓ లక్ష్మి



కొడవలూరు : సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు వివరాలను రైతులు సరి చూసుకోవాలని ఏఓ లక్ష్మి కోరారు. నార్తురాజుపాళెం ఆర్బీకేలో రైతులతో కలిసి పంట నమోదు జాబితాలను బుధవారం ఆమె ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నమోదు వివరాల ప్రకారమే ధాన్యం కొనుగోలు, సున్నా వడ్డీ పంట రుణాలు, పంట రుణాలు, పంటల బీమా తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాలయ్య, వీఏఏ శివజ్ఞాన, రైతులు కొండా శ్రీనివాసులురెడ్డి, గంగపట్నం జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కొందరు హత్యాయత్నం చేసిన ఘటనపై సంతపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు..కోటమిట్టకు చెందిన షాహుల్ హమీద్ పెద్దమార్కెట్‌లో మటన్‌షాపులో పనిచేస్తున్నారు. ఆయనకు గతంలో సందానీ, మసూద్, కోటప్ప అలియాస్ ఫైరోజ్, తదితరులతో పాతగొడవలున్నాయి. వారు ఎలాగైనా షాహుల్‌హమీద్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా కొద్దిరోజులుగా షాహుల్‌తో కోటప్పతో సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న షాహుల్‌కు కోటప్ప ఫోన్‌చేసి మద్యం సేవించేందుకు సంతపేట పొర్లుకట్ట వద్దకు రమ్మని కోరాడు. హమీద్ అక్కడికి వెళ్లగా సందానీ, మసూద్, కోటప్ప మారణాయుధాలతో దాడిచేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన షాహుల్ వారి నుంచి తప్పించుకుని పరారయ్యాడు. ఈ మేరకు బాధితుడు బుధవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.